

వసూళ్లకు పాల్పడిన కాంట్రాక్ట్ వైద్యుడి తొలగింపు

లింగంపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పీఎంపీ వైద్యుల వద్ద డీఎంహెచ్‌వో పేరుతో వసూళ్లకు పాల్పడిన కాంట్రాక్ట్ వైద్యుడు బాలక్రిష్ణను విధుల నుంచి తొలగించినట్లు డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తెలిపారు. ఈనెల 17న లింగంపేట పీఎంపీ వైద్యుల వద్ద డబ్బులు వసూలు చేయడంతో అనుమానం వచ్చిన వైద్యులు పట్టుకుని పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపిన వైద్యశాఖ అతనిని విధుల నుంచి తొలగించారు.

నేటి నుంచి.. నాలుగు పథకాల అమలు



- నేటి నుంచి లబ్ధిదారులకు పథకాలు అమలు చేయనున్న ప్రభుత్వం
- మార్చి 31 వరకు అర్హులకు పథకాల కేటాయింపు
- 21 వేలకు పైగా కొత్త రేషన్‌కార్డుల జారీ
- ఎకరంలోపు ఉన్న రైతులకు నేటి నుంచి రైతుభరోసా
- అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు
- 60 వేల కుటుంబాలకు పైగా ఆత్మీయ భరోసా
- ప్రతీ మండలంలో ఒక గ్రామం ఎంపిక చేసి అర్హులకు పథకాల అమలు

కామారెడ్డి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు కొత్త సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు సిద్ధమైంది. నేటి నుంచి రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ గృహాల పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేయనుంది. ఇందు కోసం జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నాలుగు పథకాలను లబ్ధిదారులకు కేటాయించేందుకు పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లాలోని ప్రతీ మండలంలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులైన వారికి నాలుగు పథకాలను కేటాయించనున్నారు. ఈ సంక్షేమ పథకాల అమలు కోసం ఇప్పటికే క్షేత్రస్థాయిలో వారం రోజుల పాటు సర్వే పూర్తి చేయగా మరో నాలుగు రోజుల పాటు గ్రామ, వార్డు సభలను నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే సంక్షేమ పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తడంతో ఈ నాలుగు సంక్షేమ పథకాల అమలుకు మార్చి 31 వరకు కొనసాగుతుందని ప్రభుత్వం ప్రకటించింది.

21వేల పైగా కొత్త రేషన్‌కార్డులు

నేటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులను జారీ చేయనుంది. అయితే జిల్లాలో కొత్త రేషన్‌కార్డుల జారీకి లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వం ఇప్పటికే జిల్లాకు పంపింది. గతంలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో రేషన్‌కార్డులు లేనివారు 21,842 మందిని గుర్తించారు. ఈ జాబితా ఆధారంగా పౌర సరఫరాలు, రెవెన్యూశాఖల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపికకు సర్వే చేపట్టారు. అనంతరం కొత్త రేషన్‌కార్డుల లబ్ధిదారుల జాబితా తయారు చేసేందుకు గ్రామ, వార్డు సభలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామాల్లో, మున్సిపల్ పరిధిలో, వార్డుల్లో సభలు నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేశారు. ఎవరైన అర్హులుగా ఉండి జాబితాలో పేర్లు లేనివారు గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. కొత్త రేషన్‌కార్డులే కాకుండా ప్రస్తుతం ఉన్న రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులకు సైతం అవకాశం కల్పిస్తూ గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకున్నారు. ఇలా రేషన్‌కార్డుల కోసం 54,530 దరఖాస్తులు చేసుకున్నారు.ఈ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేయనున్నారు.

60 వేలకు పైగా కుటుంబాలకు ఆత్మీయ భరోసా

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా భూమి లేని కూలీల కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున అందించడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఆయా కుటుంబాలకు ప్రతీ 6 నెలల కోసారి రూ.6వేల ఆర్థిక సాయాన్ని ఖాతాలో జమ చేయనున్నారు. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి వారికి ఆదివారం నుంచి పథకం వర్తింప చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా జిల్లాలో ఉపాధిహామీ పథకం లెక్కలు తీసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 20 రోజులు అంతకంటే ఎక్కువ పని దినాలు చేసినవారు 60వేల కుటుంబాలు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో ఎవరికైన గుంట భూమి ఉంటే అనర్హులుగా గుర్తిస్తారు. ఇందుకోసం ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో అర్హులను గుర్తించారు. అర్హులై ఉండి జాబితాలో పేర్లు లేనివారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆత్మీయ భరోసాకు మొత్తం 18,098 దరఖాస్తులు వచ్చాయి.

అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి శ్రీకారం చుట్టనుంది. గతంలో ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే చేపట్టి అర్హులైనవారి జాబితాను సిద్ధం చేశారు. ఆ జాబితాను ఇటీవల నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో ప్రకటించారు. గత ప్రజాపాలనలో 2,11,362 దరఖాస్తులు వచ్చాయి. వాటిన్నింటి సర్వే పూర్తి చేశారు. గ్రామసభల్లో ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో చాలా మంది అర్హులైన వారి పేర్లు లేకపోవడంతో అధికారులను నిలదీశారు. ఈ గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు సైతం స్వీకరించారు. ఇలా గ్రామ, వార్డుసభల్లో ఇందిరమ్మ ఇళ్లకు 28,653 దరఖాస్తులు వచ్చాయి.

నేటి నుంచి రైతు భరోసా

రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాలో జమ చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. మొదట ఎకరం వరకు ఉన్న అర్హులైన రైతులకు నేటి నుంచి పెట్టుబడి సాయం నిధులను ఖాతాలో జమ చేయనుంది. అర్హులైన రైతులకు ప్రతీ సంవత్సరం ఎకరానికి రూ.12వేల చొప్పున నగదు జమచేసే ప్రక్రియను ఇప్పటికే మొదలు పెట్టింది. వానాకాలం, యాసంగి సీజన్‌లలో రూ.6 వేల చొప్పున నగదు అందించనుంది. గతంలో రైతుబంధు పథకంతో సాగులో లేని భూములకు సైతం పెట్టుబడి సాయం అందడంతో నిధులు దుర్వినియోగం అయ్యాయని ప్రభుత్వం గుర్తించింది. దీంతో ఇటీవల సాగుకు యోగ్యత లేని భూముల లెక్క తేల్చేందుకు సర్వే చేపట్టారు. ఇలా జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో సుమారు 8,552 ఎకరాలు సాగుకు యోగ్యం కాని భూములుగా గుర్తించారు. ఈ భూములకు సైతం గత ప్రభుత్వంలో రైతుబంధు కింద పెట్టుబడి సాయం నిధులు అందుతూ వచ్చాయి. ఈ భూములను పోర్టల్ నుంచి ప్రభుత్వం తొలగించింది. ప్రస్తుతం అర్హులైన రైతులకు, సాగులో ఉన్న భూములకు మాత్రమే ప్రభుత్వం రైతుభరోసా పథకాన్ని అమలు చేయనుంది. అదేవిధంగా కొత్తగా పట్టా పాసు పుస్తకాలు జారీ అయిన వారికి అవకాశం కల్పించింది. జిల్లాలో 17,215 కొత్త పట్టా పాసు పుస్తకాలు జారీ అయ్యాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వీరి నుంచి రైతు భరోసా కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రైతులు దీని కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించిన గ్రామసభల్లో రైతు భరోసాకు 2,653 దరఖాస్తులు వచ్చాయి.


కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్టేజీ

గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

కామారెడ్డి టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): భారత గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కామారెడ్డి కలెక్టరేట్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జాతీయ పతాకవిష్కరణ చేయనున్నారు. సంక్షేమ కార్యక్రమాలపై ప్రసంగం, అధికార, అనధికారులతో పరి చయ కార్యక్రమం, అవార్డులు, ప్రశంసా పత్రాలు అందిం చనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం సాయ ంత్రం కామారెడ్డి పట్టణంలోని కళాభారతిలో 5 గంటల కు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు.


అతిథుల కోసం టెంట్లు, కుర్చీలు


వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న షబ్బీర్‌అలీ, మున్సిపల్ కౌన్సిలర్లు

ప్రజాసేవ చేసే ప్రతీ ఒక్కరిని ప్రజలు గుర్తుంచుకుంటారు

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవ చేసే ప్రతీ ఒక్కరిని ప్రజలు గుర్తుంచుకుంటారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పర్నిక ప్యాలెస్‌లో కామారెడ్డి మున్సిపల్ పాలకవర్గ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఉండి సేవ చేసిన వారు తప్పకుండా గెలిచి మళ్లీ వస్తారని కౌన్సిలర్‌గా గెలిచి సేవ చేసి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన వారు కూడా ఉన్నారన్నారు. ఎంతో మంది కనుమరుగు కూడా అయ్యారని అన్నారు. మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగిసిందని, ఒకవైపు గ్రామ పంచాయతీలు, మరోవైపు మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవి కాలం ముగియడంతో ప్రత్యేక అధికారులతో పాలన సాగుతుందని ప్రస్తుతం మున్సిపాలిటీల్లో సైతం ప్రత్యేక అధికారులను నియమించేందుకు కసరత్తు జరుగుతుందని తెలిపారు. త్వరలో గ్రామ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందని అన్నారు. అత్యవసర, రెగ్యులర్‌గా జరిగే పనులన్నింటికీ ఎలాంటి ఆటంకం లేకుండా ప్రత్యేకాధికారులు చర్యలు చేపడతారని అన్నారు. కీలక అభివృద్ధి పనులు జరగాలంటే కౌన్సిల్ తీర్మానం తప్పనిసరి కావడంతో వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. కులగణనను ఇప్పటికే పూర్తి చేశామని బీసీలకు న్యాయం చేయడానికి కులగణన ప్రకారమే ఎన్నికల్లోకి వెళ్తామని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ ఆమె పదవి చేపట్టిన తర్వాత నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. ప్రతీ కౌన్సిలర్ వారి అనుభావాలను, ఇబ్బందులను వివరిస్తూ ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ మండలంలోని ఒక గ్రామంలో నాలుగు పథకాల కార్యక్రమం నిర్వహించాలి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

కామారెడ్డి టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం నుంచి 4 నూతన పథకాలను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శనివారం నూతన పథకాల ప్రారంభ ఏర్పాట్లపై కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జారీ పథకాలను లాంచనంగా ప్రతీ మండలంలోని ఒక గ్రామంలో ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. 250 నుంచి 400 వరకు ఇళ్లు ఉన్న గ్రామాలను స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఈ గ్రామాలను ఎంపిక చేయాలని అన్నారు. ప్రజాపాలన ప్రారంభించే గ్రామాల జాబితా, గ్రామాల్లో 4పథకాల లబ్ధిదారుల వివరాలను నిర్ణీత నమూనాలో పంపాలని కలెక్టర్‌లకు సూచించారు. నూతన రేషన్‌కార్డుల జారీని తహసీల్దార్ బృందం, ఇందిరమ్మ ఇళ్ల జాబితాను ఎంపీడీవో బృందం, రైతుభరోసా జాబితాను మండల వ్యవసాయాధికారి బృందం, ఇందిరమ్మ రైతు భరోసా జాబితాను ఏపీవోఅండ్‌నరేగా బృందం పరిశీలించి ఆ జాబితాలో అర్హులు మాత్రమే ఉండేలా పథకాలు అమలుపరిచేలా చూడాలని తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపి క్షేత్రస్థాయి విచారణ చేయాలని, ఆ దరఖాస్తుల్లో అర్హులు ఉండే పేర్లు నమోదు చేసి రేపటి లాంచింగ్ కార్యక్రమంలో పథకాలను సంబంధిత లబ్ధిదారులకు వర్తింపచేయాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో 535 గ్రామసభలు, 80 వార్డు సభలు నిర్వహించడం జరిగిందని, రేషన్ కార్డుల కోసం 54,534, ఇందిరమ్మ ఇళ్ల కోసం 28,653, రైతుభరోసా కోసం 2,653, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 18,098 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్‌డీవో పీడీ సురేందర్, డీఏవో తిరుమల ప్రసాద్, డీపీవో శ్రీనివాస్‌రావు, జడ్పీ సీఈవో చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నేటితో ముగియనున్న పురపాలన

- రేపటి నుంచి మాజీలు కానున్న చైర్మన్‌లు, కౌన్సిలర్లు
- మూడు మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారుల నియామకానికి కసరత్తు
- 2020లో మూడు మున్సిపాలిటీల్లో పాలకవర్గాల ఏర్పాటు
- ప్రభుత్వం మారడంతో మారిన కండువాలు

కామారెడ్డి టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పాలకవర్గ సభ్యుల కాలపరిమితి ఆదివారం ముగియనుండగా రేపటి నుంచి ఆయా మున్సిపాలిటీల్లోని చైర్మన్‌లు, కౌన్సిలర్లు మాజీలు కానున్నారు. వెంటనే ప్రత్యేకాధికారులను నియమించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతం పంచాయతీ, మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో పాలన సాగుతుండగా తాజాగా మున్సిపాలిటీలు కూడా ఆ జాబితాలో చేరనున్నాయి. పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికలు మరో రెండు నెలల వ్యవధిలో నిర్వహిస్తారనే ప్రచారం సాగుతుండడంతో మున్సిపాలిటీల ఎన్నికలకు మరి కొన్ని నెలలు పట్టనుందని తెలుస్తోంది.

2020లో పాలకవర్గం ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా ఉన్న కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలకు 2020 జనవరిలో ఎన్నికలు జరిగాయి. పాలకవర్గాలన్నీ అదేనెల 27న బాధ్యతలు స్వీకరించాయి. జిల్లాలో కామారెడ్డి మున్సిపాలిటీకి మహిళ చైర్‌పర్సన్ ఉండగా, ఎల్లారెడ్డి, బాన్సువాడకు పురుషులు చైర్మన్‌లుగా వ్యవహరించారు. అయితే పాలకవర్గాల బాధ్యతలు చేపట్టిన రెండు నెలల సమయంలోనే కరోనా మహమ్మారి విజృంభించడంతో లాక్‌డౌన్ విధించడంతో మున్సిపాలిటీల్లో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. కరోనా సమయంలో నిధులు లేక ఇబ్బంది పడుతుండగా అప్పటి ప్రభుత్వం పట్టణ ప్రగతి పేరుతో కొత్త కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. దీనికి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేస్తామని ప్రకటించింది. ఈ నిధుల ద్వారా రాష్ట్ర పరిధిలోనే వివిధ పనులకు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. దీంతో పాలకవర్గాలు ఎలాంటి పనులు చేయడానికి వీలు లేకుండా పోయింది. వీధి దీపాలు, సెంట్రల్ లైటింగ్, సిస్టమ్, వైకుంఠ ధామాలు, పట్టణ ప్రకృతి వనాలు, సమీకృత మార్కెట్ వంటి పనులు చేపట్టిన నిధులు సక్రమంగా విడుదల కాక పలుచోట్ల మధ్యలోనే నిలిచిపోయాయి. కామారెడ్డితో పాటు బాన్సువాడకు పెద్ద మొత్తంలో అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో కొద్దిమేర అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో పాటు మున్సిపాలిటీల్లోని పారిశుధ్య నిర్వహణకు కావాల్సిన వాహనాలను కొనుగోలు చేశారు.

ప్రభుత్వం మారడంతో మారిన కండువాలు

మున్సిపల్ ఎన్నికల సమయంలో జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేసింది. కామారెడ్డి మున్సిపాలిటీలో మొత్తం 49 వార్డులు ఉండగా 23 బీఆర్ఎస్, 12 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ, 6 గురు ఇండిపెండెంట్‌లు గెలిచారు. చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన నిట్టు జాహ్నవి, వైస్ చైర్‌పర్సన్‌గా గడ్డం ఇందుప్రియ ఎన్నికయ్యారు. బాన్సువాడలో 19 వార్డులకు 16 బీఆర్ఎస్, 2 కాంగ్రెస్, ఒకటి స్వతంత్రులు గెలిచారు. బీఆర్ఎస్‌కు చెందిన గంగాధర్ చైర్మన్, జుబేర్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఎల్లారెడ్డిలో 12 వార్డులకు గాను 9 మంది బీఆర్ఎస్, ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్‌లుగా గెలిచారు. సత్యనారాయణ చైర్మన్‌గా, సుజాత వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ తర్వాత 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మున్సిపాలిటీల్లో కౌన్సిలర్‌లు పార్టీల కండువాలు మార్చారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి పెద్ద మొత్తంలోనే కౌన్సిలర్‌లు కాంగ్రెస్ పార్టీలోకి మారారు. కామారెడ్డి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్‌గా ఉన్న జాహ్నవిపై అవిశ్వాసం పెట్టడంతో పదవిని కోల్పోయింది. ఆ తర్వాత నిర్వహించిన ఎన్నికల్లో వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న గడ్డం ఇందుప్రియ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పదవిని చేపట్టారు. ఎల్లారెడ్డిలో చైర్మన్ సత్యనారాయణపై అవిశ్వాసం పెట్టారు. ఆయన స్థానంలో శ్రీకాంత్ చైర్మన్ అయ్యారు. బాన్సువాడలో మాత్రం అవిశ్వాసం పెట్టలేదు. మున్సిపల్ చైర్మన్ గంగాధర్ మెజార్టీ కౌన్సిలర్‌లు కాంగ్రెస్‌లో చేరడంతో ఆయన కొనసాగుతూ వచ్చాడు. ఇలా 5సంవత్సరాల పాటు కరోనాతో, నిధుల లేమితో, ఆ తర్వాత కండువాల మార్పుతో చేసి చేయని అభివృద్ధితో మున్సిపల్ పాలకవర్గాల కాలపరిమితి మాత్రం ముగిసింది. దీంతో నేటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది.

ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి : ఎమ్మెల్యే తోట

మహ్మద్‌నగర్ (నిజాంసాగర్), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హయాంలో ఇచ్చిన హామీలను అంచెలంచెలుగా నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు తెలిపారు. శనివారం నిజాంసాగర్ ఉమ్మడి మండలం మహమ్మద్ నగర్‌లో సింగల్‌విండో ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజా సంక్షేమం కోసం ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని ఆయన అన్నారు. మహమ్మద్‌నగర్ మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో పాటు రోడ్లు, తాగునీరు, మురికి కాలువలు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాల ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. మహ్మద్‌నగర్ మండలాన్ని ప్రభుత్వ హయాంలో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో త్వరలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందరూ ఐకమత్యంగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మె ల్యే పంపిణీ చేశారు. ఈ సమావేశంలో మహమ్మద్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు సవాయిజైసింగ్ భూషణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

జాతీయస్థాయి క్యారం పోటీలకు భీమ్‌గల్ వాసి


ఎంపికైన సతీష్

భీమ్‌గల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ పట్టణ కేంద్రానికి చెందిన నూతికట్టు సతీష్ జాతీయస్థాయి క్యారం పోటీలకు ఎంపికయ్యారు. సంగారెడ్డి ఎంపీవోగా పనిచేస్తున్న సతీష్ రాష్ట్ర, జాతీయస్థాయి క్యారం పోటీల్లో రాణిస్తుండడంతో ఫిబ్రవరి 17 నుంచి 22వ తేదీ వరకు మహారాష్ట్రలోని పుణేలో జరుగుతున్న ఆల్‌ఇండియా సివిల్ సర్వీసెస్ క్యారం పోటీలకు తెలంగాణ రాష్ట్రస్థాయి జట్టులో ఎంపిక చేశారు.

ఘనంగా సంవిధాన్ గౌరవ అభియాస్

మాక్లూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముల్లంగి, బొంకన్‌పల్లి గ్రామాల్లో శనివారం సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని మండల అధ్యక్షురాలు గంగోని మాదరి మమత రాజేష్, మండల కన్వీనర్, నాయకులు రమేష్‌నాయక్, గంగోని సంతోష్ పాల్గొన్నారు.

గంజాయి వినియోగిస్తున్న ఇద్దరి బైండోవర్

ఆర్మూర్‌టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గంజాయి వినియోగిస్తున్న ఇద్దరిని తహసీల్దార్ గజానంద్ ఎదుట బైండోవర్ చేసినట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. గంజాయి వినియోగాన్ని అరికట్టడానికి 128 డీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి బైండోవర్ చేశామన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పారితోషికం

వేల్పూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుకునూర్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి గ్రేడ్‌తో ఉత్తీర్ణులైన ముగ్గురు విద్యార్థులకు పతాని నడ్పి పోశన్న స్మృతి సమితి ఆధ్వర్యంలో శనివారం పతాని సురేందర్ పారితోషికాన్ని అందజేసినట్టు హెచ్‌ఎం చరణ్ తెలిపారు. గత సంవత్సరం పదవ తరగతిలో ప్రథమ ర్యాంకు సాధించిన డికొండ మీనాక్షి, ద్వితీయ బహుమతి సాందపురం అద్విత్‌గౌడ్, తృతీయ బహుమతి పెద్దింటి శైలజలకు పారితోషికం అందజేసినట్టు హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో పాఠ శాల ఉపాధ్యాయులు శ్రీధర్‌రావు, పతాని గంగాధర్, చరణ్ దాస్, మల్కన్న, అశోక్ పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ అంతరాయం

ఆర్మూర్‌టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని పోచంపాడ్, మోర్తాడ్ సబ్‌స్టేషన్ పరిధిలో గల వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ అంతరాయం ఉందని విద్యుత్ డీఈ రాజేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు విద్యుత్ కేపాసిటి మరమ్మతులో భాగంగా పోచంపాడ్ పరిధిలో ముప్కాల్, రెంజర్ల, బాల్కొండ, ఏర్గట్ల, తాళ్లరాంపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో పలు గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు మోర్తాడ్ సబ్‌స్టేషన్ పరిధిలో తిమ్మాపూర్, కమ్మర్‌పల్లి, పాలెం సబ్‌స్టేషన్‌లోని పలు గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలకు ఉద యం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5నుంచి 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు


పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

ఆర్మూర్‌రూరల్, జనవరి25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను 1995 ఇద్దరు పిల్లల నిబంధన చట్టం రద్దు కమిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలు ఉన్న వారు పోటీ చేయకుండా చట్టాన్ని తీసుకువచ్చారని, ఆ చట్టాన్ని రద్దు చేసి అందరికి పోటీలో పాల్గొనే అవకాశం కల్పించాలని పీసీసీ అధ్యక్షుడిని వారు కోరారు. పక్కన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆ చట్టాన్ని రద్దు చేశారని, మన రాష్ట్రంలో కూడా రద్దు చేయాలని 1995 ఇద్దరు పిల్లల నిబంధన చట్టం రద్దు కమిటీ నాయకులు కోరారు. కార్యక్రమంలో గాంధీనాయక్, ఇట్టెడి లింగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సదానంద్, రమేష్‌నాయక్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


ఆర్థిక సహాయం చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

కమ్మర్‌పల్లి జనవరి 25 : (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మర్‌పల్లి, నాగాపూర్, చౌట్‌పల్లి గ్రామాల్లో ఆదివారం రాత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. కమ్మర్‌పల్లికి చెందిన కౌడ (చాయస్‌టైలర్ డిస్కో) నర్సయ్య ఇటీవల గుండెపోటుతో మరణించగా కుటుబసభ్యులను పరామర్శించి 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నాగాపూర్ గ్రామానికి చెందిన బసకొడ దేవయ్య భార్య ఇటీవల పాముకాటువల్ల మరణించగా, అదేగ్రామానికి చెందిన జిల్లా బాజాగౌడ్ అనారోగ్యంతో మరణించడంతో వారికుటుంబసభ్యులను పరామర్శించారు. నాగాపూర్ గ్రామానికి చెందిన నరేష్ ఇటీవల గుండెపోటుతో మరణించగా కుటుబసభ్యులను పరామర్శించి 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే వెంట కమ్మర్‌పల్లి ఎంపీటీసీ సుధాకర్, నాగాపూర్ బీఆర్ఎస్ నాయకుడు కిరణ్, తదితరులు ఉన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

వేల్పూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొత్తపల్లి(ఎన్), పచ్చలనడ్కుడ గ్రామాల్లో శనివారం సాయంత్రం పలువురు బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించారు. పచ్చలనడ్కుడ సొసైటీ డైరెక్టర్ కొమ్ముల రామన్న వారి తండ్రి ఇటీవల మృతిచెందిన విషయాన్ని తెలుసుకొని కుటుంబసభ్యులను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు భీంరావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయనను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కలిసి పరామర్శించి యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు.

సర్వేనెం 571లో రైతుబంధు వర్తింపజేయాలి

కమ్మర్‌పల్లి జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రైతుబంధురాదని చెప్పడం రైతులను అయోమయానికి గురుచేస్తున్నారని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకుడు సారాసురేష్ అన్నారు. 571 సర్వేనెంబర్ రైతులతో సమావేశయ్యారు. కాగా పంట పండని భూములకు రైతుబంధు వర్తించదన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం తహసీల్దార్ అంనేయులు వ్యవసాయధికారులు సర్వే నిమిత్తం అక్కడివెళ్లగా లబ్ధిదారులు సర్వే అధికారులతో వాగ్వాదానికి దిగారు తమ భూములకు సైతం రైతు బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ

● బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో


బోధన్‌లో ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

బోధన్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఓటుహక్కు వజ్రాయుధం అని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, ఆర్‌ఐ వరుణ్ పాల్గొన్నారు.

కామారెడ్డి టౌన్ : ఓటుహక్కు విలువను కాపాడాలని అదనపుకలెక్టర్ విక్టర్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జాతీయ ఓటరు దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని ఓటుహక్కు విలువను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ రంగనాథ్ రావు, డీఆర్‌డీఏ పీడీ సురేందర్,డీపీఆర్‌ఓ భీమ్‌కుమార్, తహసీల్దార్ జనార్ధన్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, డీఏఓ తిరుమల ప్రసాద్, కలెక్టరేట్ ఏవో మసూద్‌అహ్మద్, టీఎన్‌జీవో అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి నాగరాజుపాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: ప్రతీఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటు ఒక వజ్రాయుధమని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ అన్నారు. శనివారం మామిడిపల్లి చౌరస్తానుంచి అంబేద్కర్‌చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గజానన్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈవో రాజగంగారాం తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు, అధికారులు గ్రామం లో ర్యాలీ నిర్వహించి ఓటుహక్కు, ఓటు ప్రాముఖ్యతపై నినాదాల ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మండల తహసీల్దార్ అంజనేయులు, ఎంపీడీవో రాజాశ్రీనివాస్ ఎంఈవో ఆంధ్రయ్య, హెచ్ ఎం సాయన్న, ఏపీఎం గంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెండోర : ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సంతోష్‌రెడ్డి అన్నారు. శనివారం కార్యక్రమంలో పోచంపాడ్ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేందర్, సెక్రెటరీ రాజ్‌కుమార్, రవి, రాకేష్ పాల్గొన్నారు.

భీమ్‌గల్: ప్రతీఒక్కరు ఓటు హక్కు వినియోగించుకుందామని తహసీల్దార్ మహమ్మద్‌షబ్బీర్, ఎస్సై మహేష్‌లు అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో మైనారిటీ, కృషి పాఠశాలల విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ప్రాంతంలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీవో సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

నవీపేట : జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవహారాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట రమణ, నాయబ్ తహసీల్దార్ తెలంగ్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రత్న కుమారి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు భూమయ్య, వ్యాయమ ఉపాధ్యాయుడు రవి తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్ : ఓటు వేయడం ప్రతిపౌరుని బాధ్యత అని రుద్రూర్ తహసీల్దార్ తారాబాయి సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేందర్ నాయక్, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేల్పూర్ : మండల కేంద్రంలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో తహసీల్దార్ సంతోష్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, ఆర్‌ఐ గోపాల్ పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న కామారెడ్డి అదనపు కలెక్టర్

ఆర్మూర్‌రూరల్ : ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లో శనివారం ఉన్నత పాఠశాల విద్యా ర్థులు, ఉపాధ్యాయులు జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడారు. మండల విద్యాధికారి ఎం.నరేందర్, తహసీల్దార్ రమేష్ విద్యార్థులతో ప్రమాణం చేయించారు.

పెర్కిట్ : మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా నుంచి అంబేద్కర్‌చౌరస్తా వరకు 5కెరన్ నిర్వహించారు. ఉత్తమ బీఎల్‌వోగా విధులు నిర్వహించిన మున్సిపల్ బిల్‌కలెక్టర్ చిన్న గంగామోహన్‌ను ప్రశంసాపత్రంతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ వెంక టేశ్వరరెడ్డి, తహసీల్దార్ గజానన్, మున్సిపల్ కమిషనర్‌రాజు, ఎంఈవో రాజగంగారాం, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

డొంకేశ్వర్ : నూత్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్‌కుమార్, ఏవో మధుసూదన్, ఎంఈవో రామకృష్ణ, ఆర్‌ఐ అశోక్‌సింగ్ పీఆర్‌టీయు మండల అధ్యక్షుడు రాజేశ్వర్, ఏఈవో ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

మోర్తాడ్ : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మానవహారం చేశారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు జ్యోతి, ఎం.శారద, సులోచన, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అన్ని మండలాల్లో
కొత్త పథకాలు ప్రారంభం

ఎంపిక చేసిన గ్రామాల్లో
రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ, రేషన్ కార్డులు పంపిణీ

నిజామాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 4 పథకాలు అన్ని మండలాల్లోని ఎంపిక చేసిన గ్రామాల్లో అధికారికంగా ప్రారంభిస్తున్నారు. ఈ గ్రామాల్లో రైతుభరోసా, ఇందిరమ్మ ఇల్లు, ఆత్మీయ భరో సా, ఆహారభద్రత కార్డులను పంపిణీ చేయనున్నారు. మిగతా గ్రామాల్లో విడతల వారీగా అమలు చేయనున్నారు. ఆలూర్ మండలంలో మిర్దాపల్లి, ఆర్మూర్ మండలంలో కోమన్‌పల్లి, బాల్కొండ మండలంలో జలాల్‌పూర్, భీమ్‌గల్ మండలంలో లింగాపూర్, బోధన్ మండలంలో లంగ్డాపూర్, చందూర్ మండ లంలో ఘన్‌పూర్, ధర్పల్లి మండలంలో సీతాయిపేట్, డిచ్ పల్లి మండలంలో కమలాపూర్, డొంకేశ్వర్ మండలంలో గంగ సముందర్, ఇందల్వాయి మండలంలో అంక్సాన్‌పల్లి, జక్రాన్‌పల్లి మండలంలో నారాయణ్‌పేట్, కమ్మర్‌పల్లి మండలంలో నాగా పూర్, కోటగిరి మండలంలో అడ్కాస్‌పెల్లి, మాక్లూర్ మండలం లో ముల్లంగి, మెండోరా మండలంలో కొడిచెర్ల, మోర్తాడ్ మం డలంలో దోన్‌పాల్, మోస్రా మండలంలో తిమ్మాపూర్, మోపాల్ మండలంలో నర్సింగ్‌పల్లి, ముప్కాల్ మండలంలో వేంపల్లి, నం దిపేట మండలంలో మల్లారం, నవీపేట్ మండలంలో సిరాన్‌పల్లి, నిజామాబాద్ రూరల్ మండలంలో మల్కాపూర్, పోతంగల్ మండలంలో సోంపూర్, రేంజల్ మండలంలో నీల పేపర్ మిల్, రుద్రూర్ మండలంలో బొప్పాపూర్, సాలూర మండలం లో తగ్గెల్లి, సిరికొండ మండలంలో చిన్నవాల్గోట్, వేల్పూర్ మం డలంలో పోచంపల్లి, వర్ని మండలంలో మల్లారం, ఎడపల్లి మండలంలో జైతాపూర్, ఏర్గట్ల మండలంలో దోంచంద గ్రామంలో కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రజాప్రతినిధుల తో పాటు అధికారులు పాల్గొంటారు. కొన్నిచోట్ల ఎమ్మెల్యేలు, కా ర్పొరేషన్ చైర్మన్లు కూడా పాల్గొననున్నారు. ఈ పథకాల అమలు కార్యక్రమానికి అన్నిరకాల చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు.

ప్రజలకు చక్కని పరిపాలన అందించాం

● మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మా శరత్ రెడ్డి


మున్సిపల్ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న కౌన్సిల్ సభ్యులు

బోధన్‌రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ ప్రజలకు ఐదు సంవత్సరాలలో మేలైన పరిపాలన అందించామని, పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేశామని మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని మున్సిపల్‌సమావేశపు మందిరంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ ప్రజలకు మేలైన పాలన అందించామన్నారు. ఐదు సంవత్సరాలు తమ పరిపాలనలో ప్రజలకు అందించిన సేవా కార్యక్రమాలను వివరించారు. కరోనా మహమ్మారి కష్టకాలంలో వచ్చిన ఒడిదుడుకులను సైతం సమిష్టి కృషితో సమర్థవంతంగా ఎదుర్కొన్నామన్నారు. నిధుల కొరత వల్ల కొన్ని పనులు చేయలేకపోయినా పూర్తిస్థాయి పనులు మాత్రం చేశామన్నారు. పరిపాలనలో తమకు అండగా నిలిచిన కౌన్సిలర్లకు, మున్సిపల్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సన్మాన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, ఏసీపీ కిరణ్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికార యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు.

10 నెలల్లో అభివృద్ధి పనులు చేపట్టాం

● మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్

ఆర్మూర్‌టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పది నెలల పదవి కాలంలో ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ప్రజల అవసరాలను తెలుసుకొని అభివృద్ధి చేపట్టామని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్యశ్రీనివాస్ అన్నారు. శనివారం సర్వసభ్య సమావేశంలో ఆమె అధ్యక్షతన 34 ఎజెండా అంశాలపై కౌన్సిల్ సభ్యులు ఆమోదించి తీర్మానించారు. కొన్ని అంశాలలో నిధుల కేటాయింపు ఎక్కువగా ఉండడంతో సభ్యుల కోరిక మేరకు కేటాయింపును తగ్గించామని, పది నెలల కాలంలో సభ్యులు, అధికారులు నాయకుల సహకారంతో అభివృద్ధి పనులను ముందుకు తీసు కువెళ్ళామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మున్ను, కమిషనర్ రాజు, డీఈ భూమేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ శేఖర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన...

మున్సిపల్ సమావేశంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ జీవీ.నర్సింహారెడ్డితో పాటు కౌన్సిలర్‌లు ఏజెండా కాపీని చింపివేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో అక్రమంగా కేటాయించిన 140 ఇంటి నెంబర్‌లను రద్దుచేస్తే ఏ అధికారిపై చర్యలు తీసుకున్నారో చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతిచెందిన రవి

సదాశివనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 44వ జాతీయ రహదారి ఆదర్శ పాఠశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లింగాపురం రవి (36) మృతిచెందినట్లు ఎస్‌ఐ రంజిత్ తెలిపారు. లింగాపురం రవి, భార్య లావణ్య తాడ్వాయి మండలం ఎండ్రియాల్ గ్రామానికి బంధువుల అంతక్రియల నిమిత్తం శుక్రవారం సాయంత్రం వెళ్లినట్లు తెలిపారు. శనివారం ఉదయం నల్లవెల్లి గ్రామానికి ద్విచక్రవాహనంపై భార్య లావణ్య,కూతురు, కుమారునితో తిరిగి వెళ్తుండగా సదాశివనగర్ ఆదర్శ పాఠశాల సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందన్నారు. లారీబలంగా ఢీకొట్టడంతో రవి అక్కడికక్కడే మృతిచెందగా భార్య, కూతురు, కొడుకుకు తీవ్రగాయాలు కాగా 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కొడుకు పరిస్థితి విషమంగా ఉండడంతో అత్యవసర చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. కుటుంబసభ్యులు అందించిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సూపర్‌మార్కెట్‌లో చోరీ

కామారెడ్డిటౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని విజయ సూపర్‌మార్కెట్‌లో చోరీ అయింది. సూపర్ మార్కెట్ వెనుకభాగంలో ఉన్న గోడకు శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి కన్నం వేసి నగదును, సిల్వర్ కాయినులను దొచుకెళ్లాడని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. దొంగతనం చేసిన వ్యక్తి విజివల్స్ సీసీటీవీ కెమెరాలో చిక్కాయని వాటి ఆధారంగా చోరీకి పాల్పడిన వ్యక్తిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. దుకాణ యజమానిప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి


మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే

నవీపేట,జనవరి25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఎంతైన ఉందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మ్యాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మ్యాక్స్‌సొసైటీకి చెందిన మహిళలు పెట్రోల్ బంక్ నిర్వహణ చేపట్టడం అభినందనీయమని అన్నారు. మ్యాక్స్‌సొసైటీ సభ్యులకు రాబోయే రోజులలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి తోడ్పాటు అందిస్తామని అన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో మంచి అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో మహిళలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 21వేల కోట్ల రూపాయలతో రైతు రుణమాఫీ అమలు చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ రాంచందర్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి, ప్రసన్న కుమార్, మానికేశ్వర్ రావు, మ్యాక్స్ అధ్యక్షురాలు లక్ష్మి, మేనేజర్ శోభఉన్నారు.

బడి బయట పిల్లల గుర్తింపు


సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

వర్ని, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలంలోని హుమ్నాపూర్ గ్రామంలో రాష్ట్ర, జిల్లా అధికారుల ఆదేశానుసారం బడిబయట పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. సీఆర్‌పీలు గంగారాం, యూసుఫ్, డీఎల్‌ఎంటీ ప్రసాద్ ఈ సర్వేను నిర్వహించారు. బడిబయట పిల్లలను గుర్తించి విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాలలోపు బడిఈడు పిల్లలు బడిలో చదుకోవాలన్నారు. మొత్తం 8 మంది బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించారు. సర్వేను మండల విద్యాధికారి సాయన్న పరిశీలించారు.

జక్రాన్‌పల్లి : తెలంగాణ సమగ్ర శిక్ష, విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు జక్రాన్‌పల్లిలో శనివారం బయట పిల్లల సర్వేను నిర్వహించినట్టు సీఆర్‌పీ ఎం.సత్యనారాయణ తెలిపారు. 6నుంచి 14ఏళ్ళ లోపు బడిబయట పిల్లల సర్వేను నిర్వహించడం జరుగుతుందని, బడికి వెళ్ళకుండా గ్రామాల్లో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు, పిల్లలకు కౌన్సిల్ నిర్వహించి పాఠశాలలో చేర్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఉచిత నిర్బంధ విద్య అమలులో ఉన్నందున బడిఈడు కలిగిన పిల్లలను ఎవరు కూడా పనులలో నియమించకూడదని బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. సర్వేలో గుర్తించిన పిల్లలను జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు లింగన్న, సమక్షంలో చేర్పించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్ అభినందించారు.

రామారెడ్డి : మండలంలోని ఉప్పల్‌వాయి ఇటుక బట్టీ వద్ద అవాస ప్రాంతంలో పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. అంతకు ముందు ఇటుక బట్టీ వద్ద పనిచేస్తున్న కూలీలను స్కూల్ పిల్లలను చేర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో నిట్టపు ఆనంద్‌రావు మాట్లాడుతూ జనవరి 26వ తేదీ స్వతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని రెండు రోజులు వివిధ ఆటలు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ మహబూబ్, సిబ్బంది సువర్ణ, సూపర్ వైజర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రుద్రూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాణంపల్లి గ్రామంలో గల గ్రామపంచాయతీ కార్యాలయంలో ధాత్రిశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం లలిత హాస్పిటల్ రుద్రూర్ సహకారంతో ఉచితవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఇందులో 150 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ ఇర్ఫాన్ తెలిపారు. కార్యక్రమంలో ధాత్రిశ్రీ ఫౌండేషన్ సభ్యులు గాండ్ల మధు, గంగారాం పటేల్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు లయన్ శ్యామ్ సుందర్ పహాడే, తోట అరుణ్‌కుమార్, సాయికిరణ్, తోట సంగయ్య, హరీష్, ప్రభాకర్, నితిన్, లలిత హాస్పిటల్ వైద్యబృందం తదితరులు పాల్గొన్నారు.

హున్సలో వ్యక్తి ఆత్మహత్య

సాలూర, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని హున్స గ్రామానికి చెందిన సున్నపు ఒడ్డెన్న(54) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. మద్యానికి బానిసై శుక్రవారం అర్ధరాత్రి ఇంటి సమీపంలోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకుంటున్నామన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించామన్నారు.

ధృవీకరణ పత్రాల పంపిణీ ప్రారంభం

కమ్మర్‌పల్లి జనవరి 25: (ఆంధ్రజ్యోతి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలుపరుస్తున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల ధ్రువీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమాలను ఆదివారం మండలంలోని నాగాపూర్ గ్రామంలో లాంచనంగా ప్రారంభిస్తునట్లు కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజాశ్రీనివాస్ తెలిపారు. ఉదయం జాతీయపతాకావిష్కరణల తరువాత మధ్యాహ్నం నాగాపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో లబ్ధిదారుల ధృవీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిదులు, లబ్ధిదారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థి ప్రణీత్‌కు బహుమతి అందజేస్తున్న దృశ్యం

నవీపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24, 25వ తేదీలలో జిల్లా కేంద్రంలో జరిగిన పాలిటెక్నిక్ కళాశాలల జిల్లా స్థాయి క్రీడా పోటీలలో నవీపేట పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఇద్దరు క్రీడాకారులు గెలుపొందారు. కళాశాలలో డీసీఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జయరాం రాథోడ్ జావెలిన్ త్రో పోటీలలో ప్రథమ బహుమతి గెలుపొందగా, డీసీఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రణీత్ 1500మీటర్ల పరుగు పందెంలో మొదటి బహుమతి, 800మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ బహుమతి పొందారు. జిల్లాస్థాయి క్రీడాపోటీలలో గెలుపొందిన విద్యార్థులకు నవీపేట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ రావు, పీడీ శివ మహదేవ్‌లు అభినందించారు.

రాంపూర్ చెరువులో చేపల వేటపై వేలం


రాంపూర్‌లో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

కోటగిరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపూర్ గ్రామ పంచాయతీలో శనివారం జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో చెరువులో చేపల వేటపై వేలం పాట నిర్వహించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి లాయక్ మొహినుద్దీన్ వేలం పాటకు పలువురిని ఆహ్వానించారు. ఐదు వేల డిపాజిట్‌తో గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు వేలంలో పాల్గొన్నారు. పదివేల రూపాయలతో వేలం పాట ప్రారంభించగా, గ్రామానికి చెందిన గూండ్ల గంగాధర్ మూడులక్షల నలభై మూడు వేల రూపాయలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి మాట్లాడుతూ.. వేలంలో దక్కించుకున్నవారు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రుద్రూర్ సీఐ కృష్ణ, ఎస్సై సాయన్న, జిల్లా మత్స్యశాఖ అధికారులు రాము, జానకి, నరేందర్ తదితరులున్నారు.

దొన్కల్‌లో క్రీడా దుస్తుల పంపిణీ

మోర్తాడ్, జనవరి25(ఆంధ్రజ్యోతి): దొన్కల్‌లో శనివారం ఎంపీపీఎస్, జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు స్థానికులు మామిడి రాజ్‌పాల్‌రెడ్డి వారి మిత్రబృందం రూ.60వేల విలువ గల క్రీడా దుస్తువులు, బుట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వర్, మండల విద్యాశాఖ అధికారి తమ్మిరెడ్డి పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

● ఆర్మూర్ ఎక్సైజ్ సీఐ స్టివెన్‌సన్



ఆంధ్రజ్యోతి: డివిజన్ పరిధిలో యువత డ్రగ్స్ బారిన పడుతున్న వాటిపై చర్యలేవి?

ఎక్సైజ్ సీఐ: డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి. డ్రగ్స్ బారిన పడకుండా యువతను తల్లిదండ్రులు పట్టించుకోవాలి. గంజాయి అమ్మకందారులపై కేసులు నమోదు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: మారుమూల గ్రామాల్లో బెల్ట్‌షాప్‌లు పెరుగుతున్నాయి వాటిపై చర్యలేంటి.?

ఎక్సైజ్ సీఐ: పట్టణంతో పాటు గ్రామాల్లో బెల్ట్‌షాప్‌లు ఉన్నమాట వాస్తవమే. వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: కల్తీకల్లులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎక్సైజ్ సీఐ: కల్తీకల్లులు అమ్ముతున్న షాప్‌లపై దాడులు నిర్వహించి శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నాం. కల్తీకల్లు అమ్మిన పలు గ్రామాల్లో లైసెన్స్‌లు రద్దు చేశాం.

ఆంధ్రజ్యోతి: గంజాయి, బెల్ట్‌షాప్‌లు లేని గ్రామాలను భవిష్యత్‌లో చూడగలుగుతమా?

ఎక్సైజ్ సీఐ : రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు గంజాయి, బెల్ట్‌షాప్‌లపై గట్టి నిఘాను ఏర్పాటు చేశాం. గంజాయి బారిన పడ్డ యువతకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌లు ఏర్పాటు చేశాం. ప్రజలకు సమాచారం తెలిస్తే 87126 58974కు సమాచారం అందించాలి.

● ఆర్మూర్‌టౌన్

రాష్ట్రంలోనే బాన్సువాడ మున్సిపాలిటీ ముందంజ

● అభివృద్ధిలో మున్సిపల్ పాలకవర్గం కృషి మరువలేనిది ● ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాలయం ముందు గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు పోచారం



సమావేశంలో మాట్లాడుతూ..

బాన్సువాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ అభివృద్ధిలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్‌తో పాటు పాలకవర్గం సభ్యుల పాత్ర, కృషి ఎంతో ఉందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం బాన్సువాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మున్సిపల్ పాలకవర్గం వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ముందు నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం, ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజులు ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో వైకుంఠధామంలో మరమ్మతులు చేసిన స్మశాన వాటికను పునఃప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బాన్సువాడ మున్సిపాలిటీ అభివృద్ధిలో మున్సిపల్ పాలకవర్గం పాత్ర ఎంతో ఉందని చైర్మన్ కౌన్సిలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి పారిశుధ్యం, తాగునీటి సమస్య రోడ్ల నిర్మాణం వంటి సమస్యలు పరిష్కరించి ప్రజలకు సేవ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల కంటే బాన్సు వాడ మున్సిపాలిటీ ఒక అడుగు ముందులో ఉందని తెలిపారు. రాజకీయంగా పదవులు వస్తాయి, పోతాయి కానీ చేసిన పని శాశ్వతంగా ఉంటుంది, పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారని అభినందించారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్తు దీపాల పరిష్కారం చేశారని ఆయన పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలను కల్పించే బాధ్యత ఎమ్మెల్యేదే అయినప్పటికీ దానిని పూర్తి స్థాయిలో మెరుగుగా నడిచేలా చూసే బాధ్యత మున్సిపాలిటీ కౌన్సిల్ దే అన్నారు. అందరి మన్ననలు పొందేలా పనిచేసిన పాలకవర్గ సభ్యులకు ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు. రాబోవు రోజుల్లో ఎన్నికలు వచ్చే వరకు సబ్ కలెక్టర్ కిరణ్మయి మేము ప్రజలకు అందుబాటులో ఉంటామని ఆయన తెలిపారు. జరిగిన అభివృద్ధి పనులు చెప్పక తప్పదు, వేరే వేరే పార్టీలలో ఉండచ్చు కానీ, కలిసి పనిచేసే సాంస్కృతి బాన్సువాడలో ఉందని, ఐదు ఏండ్లలో విమర్శలు, మనస్పర్థలు లేవన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 650 కోట్ల రూపాయలు అభివృద్ధికి వెచ్చించామని అన్నారు. ఎన్నికల తరువాత రేవంత్ రెడ్డి కొత్త ప్రభుత్వం ఏర్పాటు తర్వాత బాన్సువాడ మున్సి పాలిటీకి 10 కోట్లు మంజూరు చేశారన్నారు. బాన్సువాడ పట్టణంలో 600 మందికి మాత్రమే డబుల్ బెడ్రూమ్ ఇల్లు కావాలని దరఖాస్తులు వచ్చాయని, త్వరలోనే అందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ జనగాం గంగాధర్ తో పాటు కౌన్సిలర్లను పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసుల బాలరాజులు ఘనంగా సన్మానించారు. అనంతరం పోచారం శ్రీనివాస్ రెడ్డితో పాటు కాసుల బాలరాజ్ సబ్ కలెక్టర్ కిరణ్మయిలను పాలగవర్గ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అసమర్ధ పాలన వల్లే కాంగ్రెస్‌పై విమర్శలు

● అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం
● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



డిచ్‌పల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ పార్టీ పేద ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందించలేదని తాము 13 నెలల కాలంలోనే పేదలకు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు రుణమాఫీ అందజేస్తుంటే ఓర్వలేకే బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం అర్థరహితమని కేసీఆర్ కుటుంబం త్వరలోనే ఎర్రగడ్డకు పోవడం ఖాయమని కేసీఆర్ కుటుంబంలో తండ్రి ఒకవైపు, కూతురు కవిత మరో వైపు, కుమారుడు కేటీఆర్ ఇంకో వైపు, అల్లుడు హరీష్ రావు ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేయడం హాస్యాస్పదమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని కేఎస్ఆర్ గార్డెన్‌లో స్థానిక నాయకు లు, పార్టీ ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తశుద్ధి లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రైతాంగానికి ప్రస్తుతం మూడు ప్రాజెక్టులు ఎండిపోయి రైతాంగానికి నీరందని పరిస్థితి నెలకొందని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం విత్తనాలు, ఎరువులు సరఫరా చేసి కాళే శ్వరం ప్రాజెక్టు వద్ద అనుకున్నదానికంటే ఎక్కువ స్థాయిలో రైతాంగం పంటలు పండించిందన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా రైతాంగానికి అందిస్తున్నామని రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. ఇచ్చిన మాటకు కాంగ్రెస్ కట్టుబడి పథకాలు అమలు చేస్తుంటే ఓర్వలేని బీఆర్ఎస్ పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారని అన్నారు. దళితబంధు బీఆర్ఎస్ పార్టీ నాయకులకే, డబుల్ బెడ్‌రూం వారికే అందించారని ఆయన దుయ్యబట్టారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా 4లక్షల ఎకరాల వ్యవసాయ యోగ్యం లేని భూములను రైతుభరోసా నుంచి తొలగించామని గుట్టలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తాము రైతుభరోసా అందించడం లేదన్నారు. రైతులకు ధరణి ద్వారా భూములకు అన్యాయం జరుగకుండా ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తెచ్చిందని నెలరోజుల్లో విధివిధానాలు రైతాంగానికి అందుతాయన్నారు.

నేడు అన్ని మండలాల్లోని గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలు

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాలు అధికారుల ద్వారా ప్రారంభం చేస్తామని జనవరి 26న హైదరాబాద్‌లో ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంచనంగా ప్రారంభిస్తారని రూరల్ ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులకు లబ్ధిచేకూర్చేందుకే 21 నుంచి 24 వరకు గ్రామాల్లో గ్రామసభలను ఏర్పాటు చేశామని అర్హులకు ప్రభుత్వ పథకాలు లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ సంకల్పం అన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో బీఆర్ ఎస్ హయాంలో గ్రామసభలు జరగలేదన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్ నాల్గున్నర లక్షల జీతం తీసు కుంటూ ఫాంహౌజ్‌కే పరిమితం అయ్యాడని అధికారంలో ఉన్న హయాంలో ఎమ్మెల్సీ కవిత బీసీలను మర్చిపోయి బీసీలపై కపట ప్రేమ ఒలకపోయడం తగదన్నారు. తెలంగాణను పూర్తిగా సర్వనాశనం చేసింది కేసీఆర్ కుటుంబం అని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ఉనికి ప్రశ్నార్థకం అవుతుందని ఉనికి కోసమే కల్లబొల్లి మాటలు మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. రూరల్ నియోజకవర్గంలో ఎస్‌డీఎఫ్, ఎన్ఆర్‌జీఎస్ ద్వారా ధర్పల్లి మండలానికి 11 కోట్లు, సిరికొండకు 14 కోట్లు, మోపాల్‌కు 9 కోట్లు, నిజామాబాద్ రూరల్‌కు 10 కోట్లు, డిచ్‌పల్లికి 17 కోట్లు, ఇందల్వాయికి 22 కోట్లు, జక్రాన్‌పల్లికి 12 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తాటిపల్లి నగేష్‌రెడ్డి, మాజీ మండల ప్రసిడెంట్ కంచెట్టి గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, పార్టీ ప్రతినిధులు ముప్పగంగారెడ్డి, శేఖర్‌గౌడ్, షాదుల్లా, ధర్మాగౌడ్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు నమునా నిర్మాణానికి శంకుస్థాపన

సదాశివనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు నమునా నిర్మాణానికి తహసీల్దార్ గంగాసాగర్ శనివారం శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌ఓ కార్యాలయం పక్కన నమునా గృహం నిర్మించడానికి ఎంపీడీవో, ఎంఆర్వో, హౌసింగ్ డీఈ, హౌసింగ్ ఏఈ ఆధ్వర్యంలో కొలతలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ త్వరలో ఇందిరమ్మ గృహాలు నిర్మించుకోవాలంటే ప్రతీ ఒక్కరు ఈ నమునా ప్రకారం నిర్మిస్తేనే ప్రభుత్వం నుంచి బిల్లులు అందుతాయని తెలిపారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే విధంగా మండల కేంద్రంలో నమునా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగారెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు లింగాగౌడ్, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు మద్దెల భాగయ్య, మాజీ ఎంపీటీసీ బీరయ్య, గ్రామ అధ్యక్షుడు చిందం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఆర్‌టీవో శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం నడుపుతున్నప్పుడు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని ఆర్‌టీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో వాహనదారులకు అవగాహన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడుపుతున్నప్పుడు వెంట తీసుకెళ్లడం కష్టంగా ఉంటుందని, జుట్టు చెదిరిపోతుందని హెల్మెట్ వాడడం లేదని కాని ఏదైనా ప్రమాదం జరిగితే మీ విలువైన ప్రాణాలు పోతాయని మాత్రం మర్చిపోతున్నారనేది గుర్తుంచుకోవాలని తెలిపారు. ప్రతీఒక్కరు రోడ్డుభద్రత నియామలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగలక్ష్మీ, సహాయక మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

భీమ్‌గల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వివిధ వార్డులలో మంజూరైన పది సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండల కాంగ్రెస్ నాయకులు బాధితులకు శనివారం అందజేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్సలు చేయించుకున్న విషయాన్ని మండల కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ సహకారంతో చెక్కులను అందజేశారు.

దోమకొండ ప్రభుత్వ ఆసుపత్రికి మహర్దశ

● 100 పడకల ఆసుపత్రికి అప్రూవల్?
● త్వరలో వెలువడనున్న జీవో

కామారెడ్డిటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దోమకొండ ప్రభుత్వ ఆసుపత్రికి త్వరలో మహర్థశ పట్టనుంది. ప్రస్తుతం 30 పడకల సీహెచ్‌సీగా ఉన్న ఆసుపత్రి 100 పడకలతో ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. గత సంవత్సర కాలంగా 100 పడకల ఆసుపత్రి కోసం ప్రజాప్రతినిధులు, ఆయా మండలాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం 100 పడకల ఆసుపత్రికోసం కసరత్తు ప్రారంభించిందని సమాచారం. సీఎం చెంతకు సైతం ఫైల్‌చేరడంతో పాటు అప్రూవల్ సైతం పొందిందని త్వరలో జీవో కూడా వెలువడనుందని సమాచారం. ప్రస్తుతం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి జీజీహెచ్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చెందగా 300 పడకలు అందుబాటులోకి వచ్చాయి. అయితే నిత్యం వందలాది మంది ఓపీ చూయించుకునేందుకు ఆసుపత్రికి వస్తుండడం,ఇన్‌పేషంట్లతో ఆసుపత్రి కిక్కిరిసిపోవడంతో లోడ్ ఎక్కువవుతుంది. పలు సందర్భాల్లో చికిత్సలలో తాత్సర్యం జరుగుతుందని ప్రజ లు సైతం ఒకింత పెదవివిరుస్తున్నారు. అయితే ప్రస్తుతం వైద్యవిధానపరిషత్ పరిధిలో దోమకొండలో ఒక సీహెచ్‌సీనే ఉండడం అదికూడా 30 పడకలుగా ఉండడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. బీబీపేట, దోమకొండ,మాచారెడ్డి, భిక్కనూర్ మండలంలోని పెద్ద ఎత్తున గ్రామాలకు దోమకొండ సీహెచ్‌సీ ఆసుపత్రి రాకపోకలకు అనుకూలంగా ఉంది.కాని అక్కడ వైద్య సిబ్బంది, పడకలు తగినంత లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ప్రభుత్వం దృష్టికి ప్రజాప్రతినిధులు 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరడంతో ప్రభుత్వం ఆవైపుగా ఆలోచనచేసి 100 పడకల ఆసుపత్రికి అనుకులంగా చర్యలు చేపట్టినట్లు తెలుస్తుంది.

న్యాయాధికారి దంపతుల ప్రత్యేక పూజలు



పూజలునిర్వహిస్తున్న న్యాయాధికారి దంపతులు

మాచారెడ్డి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి సుమలత దంపతులు చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక కుంకుమార్చన, వివిధ రకాల పూజలు నిర్వహించనున్నారు. దర్శనానంతరం వీరికి ఆలయం తరఫున ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్‌రావు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత చదువుతో మంచి జీవితం

● సీనియర్ సివిల్ న్యాయాధికారి నసీంసుల్తానా



విద్యార్థినులతో సీనియర్ సివిల్ న్యాయాధికారి నసీం సుల్తానా

ఆర్మూర్‌టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగం సాధించినప్పుడు మంచి జీవితం ఉంటుందని సీనియర్ సివిల్ న్యాయాధికారి నసీం సుల్తానా తెలిపారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో చట్టాలపై అవగాహన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యం కోసం కష్టపడి చదవాలని, జీవితంలో పలు సమస్యలు ఉంటాయని వాటిని ఎదుర్కొని ముందుకు వెళ్లాలని, పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రతీఒక్కరు తమ సహకారం అందించాలని సూచించారు. చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో 65 మంది విద్యార్థినులకు బ్యాండ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడు శంకర్, కార్యదర్శి అరుణ్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రజనీష్‌కిరాడ్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించడం అందరి బాధ్యత

డొంకేశ్వర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని రక్షించుకోవడం అందరి బాధ్యత అని సీజీఆర్ అడ్మిన్ అధికారి అనుదీప్ పర్యావరణవేత్త జ్ఞానేశ్వర్ అన్నారు. శనివారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంలో భాగంగా 6నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఇద్దరు చొప్పున ఎన్నుకొని కమిటీని ఏర్పాటు చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల వ్యవస్థ పునాది

● ఓటు హక్కు విలువను ప్రతీఒక్కరు గుర్తించాలి ● జాతీయ ఓటరు దినోత్సవంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు



సీనియర్ సిటీజన్‌లను సన్మానిస్తున్న కలెక్టర్ తదితరులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరి రక్షణకు ఎన్నికల వ్యవస్థ పునాదిగా నిలుస్తుందని దీనిని గుర్తెరిగి ప్రతీ ఒక్కరు ఎంతో విలువైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పిలుపు నిచ్చారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహించగా జిల్లా అటవీశాఖ అధికారి వికాస్ మీనా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అనంతరం వీడియో క్లిప్ ద్వారా భారత ప్రధాన ఎన్నికల కమీషనర్ రాజీవ్‌కుమార్ సందేశం వినిపించారు. తదుపరి ఓటర్లతో ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలాకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు కుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా ప్రసాదించ బడిన ఓటుహక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాదిగా నిలుస్తుందని గుర్తు చేశారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఎన్నికల సంఘం పకడ్బందీగా ఎన్నికలు జరిపిస్తుందని ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ప్రతీ సారి వినూత్న పద్దతులను ప్రవేశ పెడుతూ ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందిస్తుందన్నారు. ఇందులో భాగంగానే గత ఎన్నికల్లో 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఇంటినుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పిస్తూ ఓట్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, ఆయా పార్టీల వారు ప్రచార అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేలా అనుమతుల ప్రక్రియను సులభతరం చేసిందన్నారు. ఎక్కడైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే ప్రజలు ఫిర్యాదు చేసేందుకు వీలుగా సీ-విజిల్ వంటి యాప్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిందన్నా రు. మన దేశంలో ప్రజాస్వామ్య బద్ధంగా కొనసాగుతున్న ఓటింగ్ వ్యవస్థ వల్ల అధికార మార్పిడి ప్రక్రియ సాఫీగా జరుగుతుందని ఇది దేశాభివృద్ధికి కూడా దోహదపడుతుందన్నారు. ఎంతో కీలకమైన ఎన్నికల ప్రక్రియను నిరాటకంగా జరిగేందుకు అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌సీసీ కేడెట్‌లు తమ వంతు సహకారం అందిస్తున్నారన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఇదివరకు ఏడాదికి ఒకసారి చేపడితే ప్రస్తుతం మూడు నెలలకోసారి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునే సమయంలో సీనియర్ సిటిజన్‌లకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలని పలువురి నుంచి వచ్చిన అభ్యర్థనలను తప్పనిసరిగా పరిగణలోకి తీసుకుంటామని ఈసీఐకి ప్రతిపాదిస్తామన్నారు. ముఖ్య అతిథి వికాస్‌మీనా, అదనపు కలెక్టర్ అంకిత్‌లు మాట్లాడుతూ స్వేచ్ఛా యుత వాతావరణంలో మనకు నచ్చిన నాయకులను ఓటు ద్వారా ఎన్నుకునే అవకాశం కేవలం ఓటు హక్కు ద్వారా సాధ్యమని నా ఒక్క ఓటుతో ఏమవుతుందిలే అనే భావన సరికాదని ప్రజాస్వామ్య పరిరక్షణలో, మంచి పాలకులను ఎన్నుకోవడంలో ప్రతీఓటు ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్, నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రధాన రహదారి పక్కనే మేకల క్రయ విక్రయాలు



నవీపేట ప్రధాన రహదారి పక్కన మేకల క్రయ విక్రయాలను జరుపుతున్న వ్యాపారులు

నవీపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతీ శనివారం జరిగే మేకల సంత స్థలం సరిపోకపోవడంతో వ్యాపారులు ప్రధాన రహదారి పక్కన సైతం వ్యాపారం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందిన మేకల సంతకు రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు మహరాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున వ్యాపారులు సంతకు వచ్చి మేకల క్రయ, విక్రయాలు జరుపుతుంటారు. ప్రతి శుక్రవారం జరిగే వారంతపు సంత స్థలంలోనే శనివారం మేకల సంతను నిర్వహిస్తున్నారు. మేకల సంతకు ప్రతి వారం 10 నుండి 15వేల వరకు మేకలు, గొర్రెలు వస్తుంటాయి. మేకలను తరలించడానికి పెద్ద ఎత్తున మినీ వ్యాన్లు, ట్రక్కులు, లారీలతో పాటు ఆటో రిక్షాలు సైతం వస్తుంటాయి. వాహనాలను పార్కింగ్ చేయడానికి సరైన స్థలం లేకపోవడంతో వాహనాలను స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో నిలిపి ఉంచుతున్నారు. మేకల క్రయ, విక్రయాలకు సంతలో స్థలం సరిపోకపోవడంతో బస్టాండ్ ఎదురుగా ప్రధాన రహదారిలో ఉన్న జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల ప్రహరీ పక్కన క్రయ, విక్రయాలు జరుపుతున్నారు. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మేకల క్రయ, విక్రయాలను సంతలో జరిగేవిధంగా చూడడంతో పాటు వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించింది

● ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా అవమానించిందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా బీజేపీ గల్లీ నుంచి ఢిల్లీ వరకు హమారా సంవిధాన్ హమారా స్వాభిమాన్ అనే నినాదంతో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగాన్ని రచించి ప్రతీ పౌరునికి స్వేచ్ఛ, సమానత్వం అందించే లక్ష్యంతో హక్కులను, విధులను కల్పించి రాజ్యాంగం అనే పవిత్ర గ్రంథం అందించిన అంబేద్కర్ గారిని గుర్తుచేస్తూ ఘనమైన నివాళులు అర్పిస్తున్నామ న్నారు. నేటితరం, రాబోయే తరాలు రాజ్యాంగాన్ని, రాజ్యాంగాన్ని రచించిన అంబే ద్కర్ ఆశయాలను, లక్ష్యాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత 75 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను పలుమార్లు అగౌరవ పరిచిం దన్నారు. వారికి వారు భారతరత్న ప్రకటించుకున్నారు తప్ప బడుగు బల హీన వర్గాల ప్రజల కోసం ఈ దేశం కోసం స్వేచ్ఛ సమానత్వం కోసం అహర్నిశలు కష్టపడి జీవితాన్ని త్యాగం చేసిన అంబేద్కర్‌కు భారతరత్న ఇవ్వడం విస్మరించిం దన్నారు. పాత పార్లమెంట్ సెంటర్ భవనంలో అంబేద్కర్ చిత్రపటాన్ని ప్రదర్శించ కుండా అవమానించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. బీజేపీ మద్దతుతోనే బాబా సాహెబ్ అంబేద్కర్ మరణానంతరం భారతరత్న పురస్కారం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆనంద్‌రావు, శివ, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నాగోళ్ల లక్ష్మీనారాయణ, కొండ ఆశన్న, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన రైతు కమిషన్ సభ్యులు



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన రైతు కమిషన్ సభ్యులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని సచివాలయంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, సభ్యులు గడుగు గంగాధర్, తదితరులు కలిశారు. మైనర్ ఇరిగేషన్‌ను మేజర్ ఇరిగేషన్ నుంచి విడదీసి మైనర్ ఇరిగేషన్ శాఖను అభివృద్ధి చేయాలని స్థానిక రైతులతో నీటి సంఘాలు ఏర్పాటు చేయాలని కోరారు. మైనర్ ఇరిగేషన్‌లో భాగ మైన చెరువులు, కుంటల పరిరక్షణకు కృషి చేయాలని గత ప్రభుత్వం మైనర్ ఇరి గేషన్ ను మేజర్ ఇరిగేషన్‌తో కలపడం వల్ల చెరువులు ఆక్రమణకు గుర య్యాయని ఈ సందర్భంగా వారు మంత్రికి తెలియజేశారు. అనంతరం తెలంగాణ అగ్రికల్చరల్ ఆఫీ సర్ అసోసియేషన్ అగ్రికల్చర్ డైరీని ఆవిష్కరించారు. ఐఏఎస్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు పొందిన సందర్భంగా ఆయనను అభినందిం చారు.


మంగళూరులో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తోట

సీసీ రోడ్ల నిర్మాణాలను నాణ్యతగా నిర్మించాలి

● జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

నిజాంసాగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళూరు, నర్సింగరావుపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలకు శనివారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు శంకుస్థాపన చేశారు. నాణ్యతగా నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్‌ను కోరారు. మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకే పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రణాళిక రూపొందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు మనోజ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రభుత్వం పథకాలను అర్హులకు అందిస్తోంది

నిజాంసాగర్ మండల కేంద్రంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అరులకు అందజేసేందుకు కృషి చేస్తోందని అన్నారు. 42 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు.

గ్రామస్థులను నిరాశపరిచిన ఎమ్మెల్యే

జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు నిజాంసాగర్ మండలంలోని వెలగనూరు గ్రామస్థులను నిరాశపరిచారు. శనివారం ఉపాధి పథకం కింద మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు విచ్చేసిన జుక్కల్ ఎమ్మెల్యే సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయకుండా గ్రామ శివారులో ఉన్న దర్గాను సందర్శించుకున్నారు. సీసీరోడ్ నిర్మాణాలకు భూమి పూజ చేయకుండా వెనిదిరిగారు. దీంతో గ్రామస్థులు నిరాశకు లోనయ్యారు.

బీర్కూర్‌లో యువకుడి అదృశ్యం


సంతోష్ (ఫైల్)

బీర్కూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కొండల్‌వాడి సంతోష్ అదృశ్యం అయినట్లు పోలీసులు తెలిపారు. గత కొన్నాళ్ల క్రితం సంతోష్‌కు వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. అయితే భార్యా భర్తల మధ్య మనస్పర్థలు తలెత్తినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా సంతోష్ ఈనెల 11న సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల వద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో సంతోష్ కుటుంబ సభ్యులు బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిజాంసాగర్‌లో..


దర్జీ భిక్షపతి

నిజాంసాగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన దర్జీ భిక్షపతి 35 సంవత్సరాలు అనే వ్యక్తి ఈనెల 24వ తేదీన భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. 24న రాత్రి 8 గంటలకు భిక్షపతి తన బైక్‌పై వెళ్లాడు. రాత్రి 9.30 అయినా ఇంటికీ రాలేదు. భిక్షపతి గ్రామ శివారులోని పాపేశ్వరాలయం వద్ద ఉన్న కుంటపై ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసి ఉంది. భిక్షపతి ఆచూకీ లభించకపోవడంతో తండ్రి కిష్టయ్య పోలీసులకు ఫిర్యాదు చేశా రు. అతని ఒంటిపై బ్రౌన్ కలర్ కాటన్ ప్యాంట్, లైట్ గ్రీన్ కలర్ ఫుల్ హాండ్స్ షర్ట్ ధరించి ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిజాంసాగర్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

నేడు రుసేగావ్‌లో ప్రభుత్వ పథకాలు ప్రారంభం

మద్నూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మద్నూర్ మండలంలోని రుసేగావ్ గ్రామంలో జుక్కల్ శాసనసభ్యుడు తోట లక్ష్మీకాంతరావు ప్రారంభించనున్నట్లు తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం జనవరి 26న ఈ నాలుగు పథకాలను ప్రారంభించాలని నిర్ణయించిందని. ఇందులో భాగంగా ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో సర్వే నిర్వహించి లబ్ధిదారుల ముసాయిదా తయారు చేయగా 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి అర్హుల జాబితాను సిద్ధం చేసినట్లు తెలిపారు.

గ్రామ సభల ద్వారా కొత్త దరఖాస్తుల స్వీకరణ

నాగిరెడ్డిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభల ద్వారా 3125 లబ్దిదారుల నుంచి కొత్తగా దరఖాస్తులను స్వీకరించినట్లు స్థానిక ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు. ఈనెల 21 నుంచి 24 వరకు మండలంలోని వివిధ గ్రామ పంచాయితీలో నిర్వహించిన గ్రామ సభల ద్వారా జాబితాలో పేరు లేని వారు కొత్తగా దరఖాస్తులు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం 920, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 444, రైతు భరోసా కోసం 134, కొత్త రేషన కార్డుల కోసం 654, రేషన్ కార్డులో కొత్తగా పేర్లు నమోదు కోసం 573, రేషన్ కార్డులను డివైడ్ కోసం 400 కొత్తగా దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలి


బాన్సువాడలో విద్యార్థులతో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్క యువతి, యువకులు ఓటు హక్కును కలిగి ఉండాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, తహసీల్దారు వరప్రసాద్, ఎంపీడీవో బషీరుద్దీన్, పట్టణ సీఐ అశోక్, ఎంపీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

బీర్కూర్: బీర్కూర్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లత, ఎంపీడీవో భానుప్రకాష్, అధికారులు పాల్గొ న్నారు.

మద్నూర్: ప్రజాస్వామ్యానికి ఓటే వజ్రాయు. దమ ని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని జిల్లా సబ్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మద్నూర్ మండల కేంద్రంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బ్యాండు మేళాలతో గురుకుల విద్యాలయం నుంచి మద్నూర్ గాంధీ విగ్రహం వరకు ఓటర్ల ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో రాణి, ఏవో రాజు, గురుకుల పాఠ శాల ప్రిన్సిపాల్ గంగాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో, మండలంలోని తాటిచెట్టు గడ్డ తండా ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్, తాటిచెట్టు గడ్డ తండా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో అధికారులు విద్యార్థులతో కలిసి అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రజితారెడ్డి, తహసీల్దార్ మహేందర్‌కుమార్, సీఐ రవీందర్‌నాయక్, ఎంపీడీవో ప్రకాష్, ఎస్సై బొజ్జ మహేష్, గిర్దావర్ శ్రీనివాస్, ఎంఈవో వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: జుక్కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు తహసీల్దార్ హిమబిందు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతు 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి, ఆర్ఐ రాంపటేల్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: భారత రాజ్యాంగం భారత పౌరులకు కల్పించిన వజ్రయుధం ఓటు అని ఓటు హక్కును వినియోయించుకునే వారికే సంక్షేమ పథకాలు, ఉద్యోగాలు, ప్రభుత్వ పథకాలు అందించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరెందర్ అన్నారు. ఆయన లింగంపేట మండల కేంద్రంలోని కళాశాలలో నిర్వహించిన ఓటు హక్కు ప్రాదన్యతను విద్యార్థులకు వివరించారు.

తాడ్వాయి: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు కీలకమని మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజీద్ అలీ అన్నారు. ఓటు వినియోగంపై గ్రామంలో ర్యాలీ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మండల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

రామారెడ్డి: మండలంలోని గిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటు యొక్క ప్రాధాన్యతను ప్రధానోపాధ్యాయుడు కన్నయ్య విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్యం, రాజేశ్వర్, భూమేష్, విష్ణువర్ధన్, మహేష్, కైలాస్, స్వప్నప్రియ, ఖాసీం, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామారెడ్డి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓటర్స్ డే సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. పీహెచ్‌సీ పర్యవేక్షకురాలు జానకి మాట్లాడుతూ ఓటు హక్కు నమోదు, వినియోగంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది సైతం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ పవన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యుడు హరీష్‌గౌడ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దివ్య భారతీ, పద్మశ్రీ, సిబ్బంది మంజూరు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈవోలు ఆయా శాఖల అధికారులతో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపల్ అశోక్ మాట్లాడుతూ ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకులు విద్యార్థులచే ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ గోపాల్‌కుమార్, మండల విద్యాధికారి ఆయా శాఖల అధికారులతో పాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్‌లో..


నాగిరెడ్డిపేటలో..


లింగంపేటలో..

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పోచారం

బీర్కూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని శనివారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామి వారికి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందజేశారు. భక్తుల తాకిడితో ఆలయం కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.


ఎమ్మెల్యే పోచారంను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

సినిమా షూటింగ్‌లకు జుక్కల్ అనుకూలం

●జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్

పెద్ద కొడప్‌గల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): త్రిభాషా సంగమ ప్రాంతంగా పేరు గాంచిన జుక్కల్ నియోజకవర్గం సినిమా షూటింగ్‌లకు ఎంతో అనుకూలంగా ఉంటుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని గుండూర్ గ్రామంలో సీవరపల్లి చిత్రం ట్రైలర్‌ను గ్రామస్తులు, చిత్ర యూనిట్‌తో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతు జుక్కల్ నియోజక వర్గం మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు దగ్గరగా ఉండటంతో ఈ ప్రాంతం సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. సీవరపల్లి చిత్రాన్ని నిర్మాణ సంస్థ వారు జుక్కల్‌లో తీయడం అభినందనీయమని తెలిపారు. ఈ చిత్రాన్ని గుండూర్ గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో వెబ్ సిరీస్‌ను తీయడం జరిగిందని, ఈ సినిమాతో ఇక్కడ షూటింగ్‌లు తీయడం ఆగిపోద్దని, చిత్రాలు షూటింగ్ చేసే వారికి ఈ ప్రాంతంవారు సహకరించడం అభినందనీయమని తెలిపారు. ఈ చిత్రం ద్వారా జుక్కల్ సంస్కృతి, జీవనవిధానం తెరకెక్కించడంతో ఈ ప్రాంత సంస్కృతి తెరపై కనబడపోతుండటంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిత్ర యూనిట్‌తో పాటు, గ్రామస్తులు పాల్గొన్నారు.


గుండూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట

నెంబర్ ప్లేట్ లేని వాహనాలు వాడితే సీజ్ చేస్తాం

పెద్ద కొడప్‌గల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ మండల పరిధిలో నెంబర్ ప్లేట్ లేని వాహనాలు తిరిగితే వాటిని సీజ్ చేస్తామని ఎస్ఐ మహేందర్ వాహనదారులను హెచ్చరించారు. శనివారం 161వ జాతీయ రహదారిపై సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేందర్ మాట్లాడుతు వాహనదారులు తాము వాహ నాలు నడిపే సమయంలో రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ఇక ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. దీంతో పాటుగానే వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు రహదారిపై ప్రయాణించే సమయంలో తమకు కేటాయించిన లైన్‌లో ప్రయాణించాలని సూచించారు. వాహనాలను పరిశీలించి జరిమానా విధించారు.

మల్కాపూర్ హనుమన్నకు దీపం స్టాండ్ వితరణ

బిచ్కుంద, జనవరి 25(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని మల్కాపూర్ హనుమాను గుడికి గర్భగుడిలో 24 గంటలు వెలిగే దీపజ్యోతి స్టాండ్‌ను చిన్నదేవాడకు చెందిన ఏడిగేవార్ స్వాతి హరీష్‌లు వితరణ చేశారు. వితరణ దంపతులతో పూజారి హనుమంతునికి పంచామృత అభిషేకం తమలపాకుల మాలతో దీప దూప నైవైద్యాలతో ప్రత్యేక పూజలుచేయించారు. స్నేహితులకు అన్నదాన వితరణ కార్యక్రమం ఏర్పాటుచేశారు.

ఎల్లారెడ్డిలో మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తా

● ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటుకు, ఇంటర్నేషనల్ స్విమ్మింగ్‌పూల్ కూడా ఏర్పాటు అయ్యేలా తన వంతు కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా నిర్వహించిన మదనన్న కబడ్డీ పోటీలలో గెలుపొందిన జట్లకు శనివారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మదనన్న కబడ్డీ పోటీలను చాలా గొప్పగా నిర్వహించారని మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణని అభినందించారు. 300 డబ్బుల్ బెడ్ రూమ్ ఇల్లు రిపబ్లిక్ డే సందర్భంగా అర్హులకు అందజేస్తానని తెలిపారు. ఎల్లారెడ్డి పెద్ద చెరువు కట్ట మినీ ట్యాంక్ బండ్ త్వరలో పూర్తి అవుతుందని, మినీ ట్యాంక్ బండ్‌పైన అమరవీరుల విగ్రహాలను ఏర్పాటు చేసి క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.దీంతో ఆ స్వర్గస్తులైన ఎమ్మెల్యేల పూర్తి వివరాలు (జీవిత చరిత్ర) తెలుస్తుందని అన్నారు. మినీ ట్యాంక్ బండ్‌పై లైటింగ్, ఫుడ్ కోర్టు, వాకింగ్ చేయడానికి వీలుగా అన్ని వసతులతో ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రజితారెడ్డి, మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉషాగౌడ్, సామెల్, సుజిత్, వాసవి, గోపికృష్ణ, శ్రీనివాస్, గఫర్, శకావత్ అలీ తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే

మున్సిపాలిటీని సుందరీకరిస్తా..

ఎల్లారెడ్డి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీని సుందరీకరణ చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మద న్‌మోహన్‌రావు అన్నారు. శనివారం ఎల్లారెడ్డి పట్ట ణకేంద్రంలోని పలు వార్డులలో మురికి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ రజితారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, కౌన్సిలర్ భూదేవి, నీలకంఠం, కాంగ్రెస్ పార్టీ నాయకులు నునుగొండ శ్రీనివాస్, విద్యాసాగర్, అరుణ, వాసవి, గోపి కృష్ణ, శ్రీనివాస్, సుజిత్, ఆజా ర్‌ఖాద్రి, ఆరీఫ్, గఫర్ తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రేషన్ బియ్యం పట్టివేత

రామారెడ్డి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపేట్ గ్రామ శివారులో స్పెషల్ టాస్క్‌ఫోర్సు టీమ్, ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో అక్రమంగా తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ళ ఏనభై ఒకటి ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. శనివారం కామెడి స్పెషల్ ఫోర్సు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్ చేరుకొని విచారణ నిర్వహించారు. పాల్వంచ మండలం భవానిపేట్ తండాకు చెందిన నాలుగు టీవీఎస్ వాహనాలు పట్టుకుని నలుగురు దొంగలను పట్టుకుని కేసు నమోదు చేసుకుని పంచనామా నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సదాశివనగర్ ఎంఎల్ఎస్ పాయిం ట్‌కు తరలించినట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ వివరించారు.

బాధితులకు సెల్‌ఫోన్‌లు అందజేత

బీర్కూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజుల క్రితం బీర్కూర్ మండలం దామరంచ, బిచ్కుంద మండలం గుండె కల్లూర్‌లకు చెందిరన ఇద్దరు వ్యక్తులు వేర్వేరు సందర్భాల్లో తమ ఫోన్‌లు చోరీ అయినట్లు బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసుకున్నారు. అనంతరం సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌లను ట్రేస్ చేసి రికవరీ చేశారు. శనివారం బాధితులకు సమాచారం అందించి పోలీస్‌స్టేషన్‌కు రప్పించారు. బాధితుల వచ్చాక వారి ఫోన్‌లను వారికి పోలీసులు అందజేశారు.

ఐకేపీలో మహిళా సమాఖ్య సమావేశం

రాజంపేట,జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం మహిళల సమాఖ్య సమావేశం నిర్వహించినట్లు ఏపీఎం సాయిలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐబీ కార్యక్రమాలు నిర్వహించి సంఘంలో లేని 252 మంది సభ్యులను సంఘంలో చేర్పించడం జరిగిందని పుస్తకాల అంతర్గత తనిఖీ చేయాలని తెలిపారు. బ్యాంకు లీంకేజీ 26.26 కోట్లకు గాను పూర్తి లక్ష్యం 100శాతం చేయడం జరిగిందని శ్రీనిధి రుణాలు ఇప్పించుటకు ఏన్పీఏ రికవరి చేయాలని తెలిపారు. ఎంటర్‌ప్రైజెస్ కౌంటింగ్ 100శాతం చేయడం జరిగిందని ముఖ్యంగా అంతర్జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ మహిళ సంఘాల సభ్యులు ప్రతిజ్ఞ చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళ మండల అధ్యక్షురాలు లక్ష్మీ, సీసీలు శ్రీనివాస్‌లు, సాయిలు,బాగయ్య, స్వామి, అకౌంటెంట్ ప్రశాంతి మహిళలు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	- సంక్రాంతికి వస్తున్నాం
దర్శన్	- పుష్ప-2
ప్రియా 70	- డాకు మహారాజ్
ప్రియా 35	- గేమ్ చేంజర్

బాన్సువాడ	
మహేశ్వరి	- గేమ్ చేంజర్
వెంకటేశ్వర	- డాకు మహారాజ్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

